# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 26-05-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- "ఒక దేశం ఒకే ఎన్నికలు" ఆచరణ సాధ్యమేనని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విశ్వాసం వ్యక్తం చేశారు.
- రాష్ట్రంలో ఈరోజు వేరు వేరు చోట్ల జరిగిన ప్రమాదాలలో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు.
- ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఎక్కువగా భూ వివాదాలకి సంబంధించిన అర్జీలే వస్తున్నాయని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు.
- యోగాంధ్ర వేడుకల్లో భాగంగా విశాఖలో యోగాభ్యాసన ప్రక్రియ కొనసాగుతోంది.
- ఆంధ్రప్రదేశ్ లోని రాయలసీమ ప్రాంతాల్లోకి ఈరోజు నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయని వాతావరణ కేంద్రం తెలిపింది.

==================

భారతదేశానికి సామర్థ్యం రీత్యా "ఒక దేశం ఒకే ఎన్నికలు" ఆచరణ సాధ్యమేనని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ఈరోజు చెన్నైలో ఈ అంశంపై జరిగిన సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ "ఒక దేశం ఒకే ఎన్నికలు" ఇప్పుడు దేశానికి అవసరమని చెప్పారు. మనసు ఉంటే మార్గం ఉంటుందని ముందు ప్రారంభిస్తే.. తదనంతరం వచ్చే అడ్డంకులను అధిగమించొచ్చన్నారు. ఈవీఎంలపై కొందరు చేస్తున్న ఆరోపణలు అర్థ రహితమన్నారు. ఒక దేశం ఒకే ఎన్నికల విధానం వల్ల ఎన్నికలనిర్వహణ కోసం చేసే ఖర్చు తగ్గుతుందని పవన్ కల్యాణ్ పేర్కొంటూ...

(వాయిస్ బైట్...28సెకన్లు)

==================

ఆంధ్రప్రదేశ్ లోని రాజమహేంద్రవరంలో ఈరోజు జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు ప్రాణాలు కోల్పోగా మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. రాజమండ్రి ఆటోనగర్ దివాన్ చెరువు పాలచర్ల సమీపంలో జాతీయ రహదారి నెం 45 వద్ద ఈ రోడ్డు ప్రమాదం జరిగింది. దివాన్ చెరువు నుంచి కొవ్వూరు వైపుగా వెళ్తున్న కారు లారీని ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. కారులో ప్రయాణిస్తున్న ఐదుగురిలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. రవాణా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఈ ప్రమాదంపై స్పందిస్తూ జరిగిన ఘటన బాధాకరమని నలుగురు మృతిపట్ల సంతాపం వ్యక్తం చేసారు.

==================

శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలం తలతంపరలో విద్యుత్ ఘాతంతో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు గాయాల పాలయ్యారు. తలతంపర గ్రామంలోని గ్రామ దేవత ఉత్సవాల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణ దీపాలకి సంబంధించిన వైరు తగలడంతో ఒక బాలికకు విద్యుత్ ఘాతమయ్యింది. బాలికను రక్షించే క్రమంలో మరో ఇద్దరు మరణించారు. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతిచెందడం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు.

===================

ప్రజాసమస్యల పరిష్కార దినోత్సవమైన సోమవారాన్ని గోల్డెన్ డే గా రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన నేపధ్యంలో గుంటూరు జిల్లాలోని కలెక్టర్ కార్యాలయంలో ఈరోజు జరిగిన ఈ కార్యక్రమాన్ని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ స్వయంగా పర్యవేక్షించి, అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి నేరుగా ఫిర్యాదుదారులనుండి అర్జీలను స్వీకరించి, వాటి పరిష్కారంపై అధికారులకు సూచనలిచ్చారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, ఈ ఫిర్యాదులలో 70 శాతం భూవివాదాలే ఉంటున్నాయని వెల్లడించారు. ఇటువంటి సమస్యలు ఎక్కడ ఆలస్యమౌతున్నాయన్నది క్రమం తప్పని సమీక్షలతో తెలుసుకోవచ్చని పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ...

(వాయిస్ బైట్...28సెకన్లు)

===================

విశాఖపట్టణం వేదికగా 'విశ్వమంతా యోగాతో ఆరోగ్యం' నినాదంతో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని అత్యంత భారీగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. అందులో భాగంగా యోగాంధ్ర పేరిట నిర్వహిస్తున్న మాసోత్సవాలలో ప్రజలను భాగస్వాములను చేస్తున్నారు. యోగాంధ్ర వేడుకల్లో భాగంగా ఈరోజు ఉదయం విశాఖలోని ఆర్కే బీచ్ రోడ్లోని యోగా విలేజ్ లో యోగాభ్యాసన ప్రక్రియ కొనసాగింది. యోగా శిక్షకులు, అభ్యాసకులు యోగాసనాలు వేశారు. వచ్చే నెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో భాగస్వామ్యం అయ్యేందుకుగాను పౌరులు యోగాంధ్ర వెబ్సైట్ లో నమోదు చేసుకోవచ్చని నిర్వాహకులు తెలియజేశారు.

===================

విరామం

===================

వైఎస్సార్ జిల్లా పేరును వైఎస్సార్ కడప జిల్లాగా మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలోనే ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. గత ప్రభుత్వం కడప పేరును తొలగించి వైఎస్సార్ జిల్లాగా పరిగణించడంపై ప్రజాసంఘాలు, పౌరహక్కుల సంఘాలు, కొన్ని రాజకీయ పార్టీల నుండి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ప్రజల నుంచి కూడా పలు వినతులు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ కడప జిల్లాగా తిరిగి నామకరణం చేసిందని ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి జి.జయలక్ష్మీ ఈరోజు విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

===================

చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాజమహేంద్రవరంలో ఈరోజు మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ.. సినీ పరిశ్రమ కోసం నూతన పాలసీని తీసుకొస్తామని... నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు కలిసికట్టుగా వస్తే చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సినిమా టికెట్ రేట్లకు సంబంధించి శాశ్వత విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించబోతోందని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు.

===================

ఆపరేషన్ సిందూర్ విజయానికి మద్దతుగా దేశ ప్రజానీకం భారత సైనికులకు గౌరవ వందనాలను తెలుపుతోంది. భారత త్రివిధ దళాలకు సంఘీభావంగా ఆకాశవాణి వార్తా విభాగం ప్రత్యేక కథనాన్ని అందిస్తోంది. ఇందులో భాగంగా మొట్టమొదటి పరమ వీర చక్ర పురస్కార గ్రహీత మేజర్ సోమనాథ్ శర్మ గురించి ఈ రోజు తెలుసుకుందాం..

(వాయిస్ బైట్...36సెకన్లు)

===================

విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం చేస్తున్న విస్తృత ఏర్పాట్లపై ఆలయ కార్యనిర్వాహణాధికారి, డిప్యూటీ కలెక్టర్ వి. కె. శీనానాయక్ ఈరోజు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రెండవ అతిపెద్ద దేవస్థానంగా శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం విరాజిల్లుతోందని.. వేల సంఖ్యలో అమ్మవారి దర్శనానికి అనేక ప్రాంతాల నుంచి భక్తులు వస్తూంటారని తెలిపారు.

===================

ఆంధ్రప్రదేశ్ లోని రాయలసీమ ప్రాంతాల్లోకి ఈరోజు నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయని మిగతా ప్రాంతాలకు విస్తరించేందుకు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని విశాఖ వాతావరణ కేంద్రం తెలిపింది. గత సంవత్సరం 2024లో జూన్ 2న రాష్ట్రంలోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు ఈ సంవత్సరం ముందుగానే కేరళను తాకడంతో ఆంధ్రప్రదేశ్ లోకి కూడా త్వరగానే చేరుకున్నాయని వాతావరణ కేంద్రం పేర్కొంది. ఇప్పటికే రాయలసీమలో పలు చోట్ల భారీ వర్షాలు కురుస్తున్నాయని, రేపు కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. గంటకు 50 నుండి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. రాబోయే 24 గంటల్లో బంగాళాఖాతంలో మరో అల్ప పీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖాధికారి వెల్లడిస్తూ...

(వాయిస్ బైట్... 26సెకన్లు)

===================

నైరుతి రుతుపవనాల కారణంగా ఈరోజు వైఎస్సార్ కడప జిల్లాలో భారీ వర్షం కురిసిందని అదేవిధంగా ఉపరితల ద్రోణి ప్రభావంతో బాపట్ల జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. చీరాల, వేటపాలెంలలో కూడా భారీ వర్షం కురిసిందని వెల్లడించింది.

===================
===================